
# కంఠంనేని రాధాకృష్ణ మూర్తి

**ఆడవాళ్ళకు ఎప్పుడు ఏ జబ్బు చేస్తుందో ఎప్పుడు ఏ వైద్యుని అవసరం వస్తుందో తెలియదు!**

**అమలకు ఇప్పుడు అలాంటి జబ్బే చేసింది.**



# డాక్టరు కంటే దర్జీ మేలు

అమల కలవాళ్ళ అమ్మాయి. ఎప్పుడూ కిల కిల లాడుతుంది. కళకళగా వుంటుంది. ఎవర్ని పడితే వాళ్ళను "బ్బె బ్బె బ్బే" అని వెక్కిరిస్తుంది. ఎవర్నిపడితే వారిని నువ్వెంత, నీ బతుకెంత అని ధిక్కరిస్తుంది. సరిలేరు నాకెవ్వరూ అంటుంది. అంత గారాబం ఆమె. పువ్వుల్లో పుట్టిందామె. పువ్వుల్లో పెరిగింది. కారుల్లో తిరిగింది. అంత అపురూపం ఆమె!

అంత అపురూపంగానూ ఆమెను కోమలరావుకిచ్చి పెళ్ళి చేసారు. అతనుకూడా ఆమెను అంత జాగ్రత్తగానూ చూసుకుంటున్నాడు. ఆమెకు కోపం వస్తే అతని కళ్ళు ఎర్రగా అవుతాయి. ఆమెకు బాధకలిగితే అతని కళ్ళవెంట నీళ్ళువస్తాయి. ఆమె కాస్తదూరం నడిస్తే అతని కాళ్ళు నెప్పిపుడతాయి. ఆమె బుగ్గల్ని ముద్దు పెట్టుకునేటప్పుడు ఎక్కడ కందుతుందోనని బాధ పడతాడతను. ఆమె పెదిమల్ని చప్పరించేప్పుడు నొప్పి పుడుతోందా అని అడుగుతాడతను. ఆమె వొంటిని నిమిరేటప్పుడు ఆ వొత్తిడికి ఆమె వొంట్లోని కండరాలు ఎక్కడ స్థానభ్రంశం పొందుతున్నాయోనని ఆదుర్దా పడతాడతను. ఆమె శరీరంతో పెనగులాడేటప్పుడు ఆమె ఊపిరి ఎక్కడ ఆగిపోతుందోనని భయపడతాడతను. అంతటి అపురూపం ఆమె భర్తకుకూడా! ఏమి అదృష్టం తల్లీ నీది!

అలాంటి అమలకు అంతపెద్ద జబ్బు చేసింది.

అసలామెకా జబ్బు ఎలా వచ్చిందంటే—

ఆ రోజు ఆమె తన స్నేహితురాలిని చూడటానికి కారులో వెళ్ళింది. కారులో తిరిగివచ్చింది. వస్తూ రాగానే మంచం మీద వాలింది. అంతే ఇక ఆమె మంచంమీంచి లేవలేకపోయింది.

మంచంమీద మెలికలు తిరిగి పోయిందామె. ఛీ! ఛీ! అంటూ ఛీత్కారాలు చేసింది. "ఎందుకీ బ్రతుకు" అంటూ తెగ నిట్టూర్పులు విడిచింది.

కోమలరావుకు ఆమెనా పరిస్థితిలో చూడగానే భయమేసింది. బెంబేలెత్తిపోయాడు.

"ఏమైంది అమలా?" అన్నాడతను.

"నా బొంద అయింది" అందామె కోపంగా.

"ఎక్కడ నీ బాధ!" అన్నాడతను.

"నా బ్రతుకే ఒక బాధ!" అందామె విసుగ్గా.

కోమలరావు వెంటనే డాక్టరుకు కబురు చేసాడు.

డాక్టరు వచ్చాడు. ఆమెను పరీక్షించాడు.

"ఏమిటి డాక్టర్ సంగతి?" అన్నాడు కోమలరావు ఆందోళనగా.

"నువ్వు తండ్రివి కాబోతున్నావు" అన్నాడు డాక్టరు సన్నగా నవ్వుతూ, బట్టతల నిమురుకుంటూ.

"నిజమా?!"

"ఎగిరి గంతేయలేదుగాని అంత సంబరంగానూ అన్నాడు కోమలరావు.

డాక్టరు కళ్ళు నవ్వుతూ చూసాయి నిజమన్నట్లుగా.

అమల మాత్రం వాళ్ళిద్దరివేపూ కోపంగా చూసింది.

ఆ రోజు గడిచింది. మరురోజు గడిచింది. అయినా అమల మంచంమీంచి లేవలేదు. ఆమె జబ్బు తగ్గలేదు.

# 'సెంటిమెంట్స్'

అంటే తమ ఫామిలీ డాక్టరు దయాగ్నసిస్ తప్పయిందన్న మాట! మరామె జబ్బేమిటి? ఎంతగా చిక్కిపోతోంది సుకుమారి?! ఆమె కళ్ళలో ఎంత వేదన కనిపిస్తోంది?!

భరించలేక కోమలరావు నగరానికి విచ్చేసిన ప్రసిద్ధ డాక్టరు విలియమ్స్‌ని ఇంటికి పిలిపించాడు.

న.వి.ప్ర.ప్ర.డా. విలియమ్స్ ఆమెను శుభ్రంగా అన్నిపరీక్షలూ చేయించాడు. రిజల్ట్సు రిపోర్టుల్ని ముందు వేసుకుని అరగంటపాటు బుర్ర గోక్కున్నాడు. జ్ఞానోదయం అయినవాడిలా చటుక్కున తలవంచి ప్రిస్క్రిప్షన్ కాగితంమీద ఇంత పొడుగున ఇంగ్లీషులో ఏదో పేరును వ్రాసాడు.

“డిసీజ్ హర్ డిసీజ్ ఐసే.” అన్నాడు.

తన భార్యకు అంత పొడుగాటి పేరుగల జబ్బు వచ్చిందని తెలియగానే కోమలరావు కళ్ళు గజ్‌జ్జన వణికాయి.

“డాక్టర్ నా అమల నాకు దక్కుతుందా?” అన్నాడు ఆందోళనగా.

“భయపడకు, అలాంటిదేమీ ఉండదు” అన్నాడు న. వి. ప్ర. ప్ర. డా విలియమ్స్ కోమలరావు భుజాన్ని తట్టుతూ.

దక్కకపోతే మరొకళ్ళని పెళ్ళి చేసుకుందువులే, అన్నట్లుందాయన భుజం తట్టిన ధోరణి.

మరో రెండ్రోజులు గడిచాయి. అమల ఇంకా చిక్కి సగమైంది. ఆమె ఇక తనకు దక్కటం అనుమానమే అనిపించింది కోమలరావుకు. అప్పటికి నాలుగు రోజులయింది ఆమెకా జబ్బుచేసి. ఆ నాల్రోజుల్లోనూ ఆమె ఒక్క సెకండుపాటయినా కళ్ళుమూసిన పాపాన పోలేదు. ఆమె కళ్ళు లోతుకు పోయాయి. చెంపలు పీక్కుపోయాయి. కాళ్ళూ చేతులూ సన్నగిల్లాయి. పిచ్చి చూపులు చూస్తోందామె. ముక్కుతోంది, మూలుగుతోంది, జీవితంపట్ల వైరాగ్యాన్ని తన నిట్టూర్పుల ద్వారా వ్యక్తం చేస్తోంది.

ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని చిన్నగా నిమురుతున్నాడు కోమలరావు. అతని కళ్ళవెంట ధారలుగా నీళ్ళు కారుతున్నాయి.

ఆమె మంచం చుట్టూ ఆమె తల్లి, తండ్రి ఇతర బంధువులూ గుమిగూడి ఉన్నారు. అందరూ దాదాపు నిశ్శబ్దంగా ఏడుస్తున్నారు. అంతటి డార్లింగ్ ఆమె అందరికీ.

ఆమె పరిస్థితి ఇవాళో రేపో అన్నట్లుంది. పాపం ఆ మర్నాడే ఆమె పుట్టినరోజు! ప్రతి పుట్టిన రోజునీ ఆమె మహా వైభవంగా జరుపుకుంటుంది. ఆహ్వానం లేకపోయినా ఆనాడు ఆమెను అభినందించటానికి చుట్టాలూ పక్కాలూ వచ్చిపోతారు. అలా వచ్చిన జనమంతా ఇప్పుడు ఆమె చుట్టూ గుమిగూడి వున్నారు. పాపం పిచ్చిపిల్ల, పుట్టినరోజు ఆమెకు గిట్టినరోజు కాబోతోందా అని వాళ్ళంతా గుసగుస లాడుకుంటున్నారు.

అలాంటి సమయంలో ఆ ఇంట్లోకి ఆ ఇంటి ఆస్థాన దర్జీ అడుగుపెట్టాడు. వారం రోజుల క్రితం అమల ఆర్డరిచ్చిన లేటెస్ట్ ఫ్యాషన్ డ్రస్సును ఇవ్వటానికి వచ్చాడతను.

ఆ ఇంటి వాతావరణాన్ని చూడగానే అతని మనస్సు ఏదో కీడును శంకించింది.

“ఏం జరిగింది?” అన్నాడతను ఆదుర్దాగా.

దర్జీ తెచ్చిన డ్రస్సును చూడగానే అక్కడ ఉన్నవాళ్ళ కళ్ళు మళ్ళీ చెమర్చాయి.

“చూడు తల్లీ నువ్వు పుట్టినరోజుకోసం ఆర్డరిచ్చిన డ్రస్సును మన మస్తాన్ కుట్టి తీసుకు వచ్చాడు చూడమ్మా!” అందామె తల్లి. ఆ డ్రస్సును అమలకు చూపించుతూ.

నీరసంగా ఆ డ్రస్సు వేపు చూసింది అమల. బలహీనంగా ఉన్న చేతిని నెమ్మదిగా పైకలేపి డ్రస్సును అటూ ఇటూ తిప్పి పరిశీలించింది. పెదవి విరిచింది.

“ఎందుకు, నా పాడెమీద పెట్టి కాల్చటానికా ఇది?” నీరసంగా అందామె. “మొన్న నేను చూసిన ఉష డ్రస్సుకంటే ఇదేమంత బాగుంది? దానికంటే లేటెస్టుదీ కాదాయె!”

కోమలరావు లేచి ఇవతలకి వచ్చాడు. దర్జీ మస్తాన్‌తో కొద్దిసేపు ఏదో మాట్లాడాడు.

“రేపటిదాకా ప్రాణాలు నిలుపుకో పిచ్చి తల్లీ,” అనుకున్నాడు మస్తాన్ ఆ ఇంటి గుమ్మం దిగుతూ.

మస్తాన్ వెంటనే ఉష వాళ్ళింటికి వెళ్ళాడు. తిరిగిరాగానే తన సహాయకుల్ని కేకేసాడు.

“ఒరేయ్ ఈ రాత్రికి మీరంతా కష్టపడాలిరా!” అన్నాడతను.

ఆ రాత్రి అతను తన కత్తెరకు పని చెబుతుండగా అవతల రెండు మిషన్లమీదా, కూర్చుని మరో ముగ్గురు చేతి కుట్లతోనూ అంతా కంటిమీద కునుకెరగకుండా తెల్లవారేదాకా కష్టపడి పని చేసారు.

తెల్లవారింది.

ఇక అమలను మంచం దింపటం మంచిదనుకుంటున్నారు అందరూ.

అలాంటి సమయంలో దర్జీ మస్తాన్ మళ్ళీ ఆ యింట్లోకి అడుగు పెట్టాడు.

కోమలరావు తన భార్య చెవి వద్ద నోరు ఉంచి “చూడు అమలా, మన మస్తాన్ నీకోసం ఉష డ్రస్సుకంటే అద్భుతమైన డ్రస్సును కుట్టి తీసుకువచ్చాడు చూడు!”

ఈ లోకపు అంచుల్ని దాటబోతున్న అమల ప్రాణాలు ఆ మాటలు వినగానే చప్పున వెనక్కి తిరిగి వచ్చాయి.

కళ్ళు తెరిచిందామె.

భర్త ఆ డ్రస్సును విప్పదీసి అటు తిప్పి ఇటు తిప్పి చూపిస్తుంటే ఆ కళ్ళు చటుక్కున మెరిశాయి.

అక్కడున్న వాళ్ళనందరినీ అవతలకి వెళ్ళమని ఆ డ్రస్సును తనకు తొడిగమందామె.

అందరూ అవతలకి వెళ్ళిపోయారు

ఆమె వొంటిమీద అంతకు ముందున్న దుస్తుల్ని వొలిచి కోమలరావు ఈ కొత్త డ్రస్సును ఆమెకు తొడిగాడు.

నెమ్మదిగా లేపి కూర్చోబెట్టాడామెను.

నిలువెత్తు అద్దాన్ని తీసుకువచ్చి ఆమె ముందుంచాడు.

అద్దంలో కొద్దిసేపు తన డ్రస్సును చూసుకుందామె.

“ఉష డ్రెస్సుకంటే నా డ్రస్సే అద్భుతంగా ఉంది.” అంది.

అద్దంలో చూసుకుంటున్న కొద్దీ ఆమెలో మార్పులు కనిపించసాగాయి. మొదట ఆమె కళ్ళల్లోకి కళ వచ్చింది. తర్వాత శరీరంలోకి జవం జీవం వచ్చాయి.

నీరసంగా మంచం మీద కూర్చున్న మనిషి కాస్తా ఛెంగున మంచం దిగింది. పూల తీగల్లాంటి తన చేతుల్ని భర్త మెడ చుట్టూ బిగించింది.

“డార్లింగ్ నువ్వెంత మంచివాడివి! ఇవాళే కదా నా పుట్టిన రోజు, పద ఆ అరేంజ్‌మెంటు చూద్దాము! ఇప్పుడు ఉషవేపు నేను గర్వంగా చూడవచ్చు!! దాన్ని కూడా ఫంక్షనుకు పిల్చావు కదూ?!”

తలుపు తెర్చుకుని చెంగు చెంగున గెంతుతూ వస్తున్న అమలను చూసి చుట్టాలూ, పక్కాలు, తల్లీ తండ్రీ అంతా ఆశ్చర్యంతో బిగుసుకుపోయారు!! ●